క్లుప్తంగా

మట్టి వినాయకుని విగ్రహాలను పూజించండి


కిలివేటి సంజీవయ్య


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నాయుడుపేట టౌన్/వెంకటగిరి(సైదాపురం) : అన్ని విఘ్నాలు తొలిగిపోయి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. వారు శుక్రవారం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. మట్టి వినాయకుని విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

ముమ్మరంగా ఉపాధి పనులు


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సైదాపురం: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా చేపట్టినట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం పాలూరు, అనంతమడుగు గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

రైతులకు పీఎండీఎస్ కిట్లు అందజేత


కిట్లు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

దొరవారిసత్రం : మండలంలోని పోలిరెడ్డిపాళెంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో శనివారం 80 శాతం సబ్సిడీతో పీఎండీఎస్ కిట్లను సూళ్లూరుపేట సహాయక సంచాలకులు జి.అనిత అందజేశారు. 10 కేజీల పీఎండీఎస్ కిట్లలో జీలుగ, జనుము, పిల్లి పెసరతో పాటు మరో ఆరు రకాల విత్తనాలు ఉంటాయి. ఒకే రకం పచ్చరొట్ట విత్తనాలు కాకుండా నవధాన్యాలు వాడితే ప్రధాన పంటకు పలు పోషకాలు అందుతాయన్నారు. ఈకిట్లు తనియాలి, పోలిరెడ్డిపాళెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 10 కేజీల పీఎండీఎస్ కిట్లు ప్యాకింగ్‌తో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏవో జ్యోతిర్మయి పాల్గొన్నారు.

చేపల వేటలేక మత్స్యకారులకు తప్పని వెతలు


తూపిలిపాళెం వద్ద బోటును ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

వాకాడు : తుపాను, వాయుగుండాల కారణంగా రెండు వారాలుగా సముద్రంపై చేపల వేట లేక గంగపుత్రులు విలవిలలాడుతున్నారు. చేపల వేటే ఆధారంగా జీవించే సంప్రదాయ మత్స్యకారులు 15 రోజులుగా ఇంటికే పరిమితమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి రాగానే వేటకు వెళ్లే ప్రతి మత్స్యకార కుటుంబానికీ రూ.20 వేలు వేట నిషేధ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు మాట తప్పింది. మండలంలో 13 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో దాదాపు 1,041 మంది వేట చేసే మత్స్యకారులు ఉన్నారు. రెండు నెలలుగా సముద్రంపై హోరు గాలి, ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న అలల కారణంగా ఆశించినంత చేపలు దొరకడంలేదు. తాజాగా తుపానుతో వేట లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేదలకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ

పెళ్లకూరు/నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోదరుడు నెలవల రాజేష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం చెంబడిపాళెం గిరిజన కాలనీలోని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గిరిజన కాలనీలో స్థానిక ప్రజల మధ్యన కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని గిరిజనులందరికీ దుస్తులు అందజేశారు. ముత్యాలయ్య, సూరిబాబు, చంద్రయ్యయాదవ్ అదేవిధంగా నాయుడుపేట స్వర్ణముఖి నది ఏటి గట్టుపై ఉన్న ఎస్టీ కాలనీ వాసులకు మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం సతీమణి అమృత సరళ దుప్పట్లు పంపిణీ చేశారు. బిర్యానీ అందజేశారు. శ్రీనివాస కల్యాణ మండపం వద్ద 786 సేవా సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 75 మంది రక్తదానం చేశారు. పాత బస్టాండు వద్ద బిర్యానీ పంపిణీ చేశారు.

30 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్ రాజమహేంద్రవరం నుంచి చెన్నైకి అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు నాయుడుపేట పట్టణ సీఐ ఎం.బాబి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో లారీలో 30 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. లారీని, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వినాయక చవితికి సర్వం సిద్ధం

- పలుచోట్ల విద్యుత్ దీపాలంకరణ
- పూజ సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిన దుకాణాలు

వెంకటగిరి రూరల్/సైదాపురం/కోట/చిల్లకూరు/గూడూరు రూరల్/ఓజిలి/సూళ్లూరుపేట రూరల్/నాయుడుపేట టౌన్ /రాపూరు : వినాయక చవితి పండుగను శనివారం ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. వెంకటగిరి పట్టణంలోని పాతబస్టాండ్, కాశీపేట కూడలి, ఆంధ్రా బ్యాంకు, కోర్టు సెంటర్, పెద్ద శివాలయం తదితర ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేస్తున్నారు. మండపాలు ఏర్పాటుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సైదాపురంలో మట్టి విగ్రహాలను విక్రయిస్తున్నారు. మట్టి విగ్రహం ఒక్కొక్కటి రూ.25 నుంచి రూ.40 వరకు, పెద్ద విగ్రహాలు రూ.2 వేల నుంచి 25 వేల వరకు ధర పలుకుతున్నాయి.

కోట పట్టణంలో పలుచోట్ల వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేస్తున్నారు. పూజ సామగ్రి, విగ్రహాల కొనుగోలుదారులతో బజారువీధి కిటకిటలాడింది.

గూడూరు, చిల్లకూరు మండలాల్లో చవితి సందడి మొదలైంది. గూడూరు పట్టణంలోని బజారువీధి, హాస్పిటల్ రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో వినాయకుడి మండపాలు ఏర్పాటుచేశారు.



చిల్లకూరు : విగ్రహాలను కొనుగోలుదారులతో సందడిగా ఉన్న రోడ్డు

చిల్లకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా కూడళ్లలో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు పందిళ్లు, మండపాలు సిద్ధం చేసుకున్నారు. విగ్రహాలు రూ.200 నుంచి రూ.2500 వరకు ధర పలుకుతోంది. మామిడాకులు, దర్భ, కలబంద, జిల్లేడు, వెలగ, జమ్మి కొనుగోలు చేస్తున్నారు.

ఓజిలి మండలంలోని మానమాల, కురుగొండ, ఓజిలి, చిలమానుచేను తదితర గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా వినాయక ఆలయాలు ముస్తాబౌతున్నాయి. యువకులు ఆయా గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసేందుకు పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నారు.

సూళ్లూరుపేట పట్టణంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న వినాయ స్వామి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను తీసుకెళ్లారు. పూజ సామగ్రి కొలుగోలుదారులతో పట్టణంలోని ప్రధాన వీధులు కిటకిటలాడాయి.

నాయుడుపేట పట్టణంలో పండుగ సందడి నెలకొంది. గడియారం సెంటర్, వెల్‌కం సెంటర్, బజారు వీధి, పడమటి వీధి, మార్కెట్ వీధి, దర్గావీధి, పాత బస్టాండు, రాజగోపాలపురం, బేరిపేట, గాంధీ పార్కు తదితర ప్రాంతాల్లో చిన్న వినాయక విగ్రహాలతో పాటు అరటి పిలకలు, పండ్లు, స్వామి వారి గొడుగులు, నెమలి ఫించాలు విక్రయాలు జోరుగా సాగాయి.

రాపూరు మండలంలో వినాయ చవితిని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


కోట: గణనాథుడిని తరలిస్తున్న యువకులు


సూళ్లూరుపేట రూరల్: క్రేన్ ద్వారా విగ్రహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం


రాపూరులో విద్యుత్ దీపాలంకరణ


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న సూళ్లూరుపేట పట్టణంలోని ప్రధాన వీధి


వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో వినాయకస్వామి పూజాసామగ్రి విక్రయాలు

ప్రత్యేక ఆకర్షణగా వినాయకుడి విగ్రహం


నాయుడుపేట పట్టణంలో సినిమా సెట్టింగా మాదిరిగా నిర్మించిన వినాయకుని ఆలయం


భారీ వినాయకుని విగ్రహం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం దర్గా వీధిలో సినిమా సెట్టింగ్‌లా వినాయకుని మండపాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 22 అడుగుల భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఎస్‌జె జ్యువెలర్‌కు చెందిన పోట్లాపూడి రాజేష్ అక్కడి దుకాణదారులతో కలిసి వారం రోజుల నుంచి ఒడిశా ప్రాంతానికి చెందిన కార్మికులు, సీని కళాకారులతో సెట్టింగు పనులు చేయించారు. ఇందుకోసం రూ.15 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తయారు చేసిన 22 అడుగుల వినాయకుని విగ్రహాన్ని భారీ వాహనంలో నాయుడుపేటకు తీసుకువచ్చారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా నాయుడుపేట పట్టణంలో రాజగోపాలపురం, పిళ్లారిగుడి వీధి, ఆకుతోట వీధి, గాంధీ పార్కు తదితర ప్రాంతాల్లోనూ వినాయకుడి విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నారు.

రైతులకు రూ.20 కోట్ల రుణాలు

సైదాపురం: రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు సీనియర్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణయాదవ్ తెలిపారు. సైదాపురం సొసైటీ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 960 మంది రైతులకు వివిధ రకాల పంట రుణాలను మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది రూ.30 లక్షల ఆదాయంతో సొసైటీ నడుస్తోందని తెలిపారు. రైతులు ఆధార్, ఫోన్ నంబర్‌ను కార్యాలయం వద్ద అందజేస్తే ఓటు హక్కు కల్పిస్తామన్నారు. సీఈవో బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సహకార సంఘం ద్వారా రైతులకు రుణాలు

రాపూరు: రాపూరులోని సహకార బ్యాంకు ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇస్తున్నట్టు పర్సన్ ఇన్‌చార్జి మురళీకృష్ణ తెలిపారు. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు, రుణాలు అందజేస్తున్నట్టు తెలిపారు. సొసైటీలో రూ.300 సభ్యత్వం కలిగిన వారు తమ ఆధార్, ఫోన్ నంబర్ ఇచ్చి సభ్యత్వాన్ని వినియోగంలోకి తెచ్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు సహకార సంఘంలో కంప్యూటరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. సీఈవో నరసింహులు, సహకార బ్యాంకు మేనేజర్ పరంధామయ్య పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

సైదాపురం: వినాయక చవితి పర్వదినం సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను వాట్సాప్ నంబర్ 7995095800 లేదా గణేష్ ఉత్సవ్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి, సచివాలయాల్లో చలానా చెల్లించి అనుమతి పొందవచ్చన్నారు. ఉత్సవాల నిర్వాహకులు వలంటీర్లను ఏర్పాటు చేసుకుని భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.

8న చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం చందనాలంకరణ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 4గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు గరుడ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

సూళ్లూరుపేట : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కోటపోలూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మెల్లకంటి చంద్రజిత్ యాదవ్‌ను ఉపాధ్యాయులు, యాదవ సంక్షేమ సంఘం నేతలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం కార్యదర్శి తుమ్మగుంట మోహన్ మాట్లాడుతూ చంద్రజిత్ యాదవ్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. తాను కూడా కోటపోలూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినేనని, నాటికి నేటికి పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు వెంపళ్ల హరికృష్ణయాదవ్, కోశాధికారి మొద్దు ప్రసాద్ యాదవ్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు మెల్లకంటి శ్రీనివాసులు యాదవ్, ముచ్చకాల హర్షవర్ధన్ యాదవ్, మాజీ కోశాధికారి గురకల వజ్రమణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రజిత్ యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

10న వేనాడు దర్గా గంధోత్సవం

తడ: మహిమాన్విత దర్గాగా పేరుగాంచిన వేనాడు షేక్ దావూద్ షావలీ అల్లా దర్గా 29వ గంధోత్సవం (రబ్బియుల్ అవ్వల్) ఈ నెల 10న నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఈ నెల 4న దర్గా వద్ద జెండా(నిషాన్) స్థాపన చేసి ఏర్పాట్లను ప్రారంభించారు. వేనాడులో 634 ఏళ్ల క్రితం బాబా సమాధి అయ్యారు. ఇక్కడ ఆసియాలోనే అతి పెద్దదైన 144 అడుగుల పొడవున్న దర్గా ఉంది. అమావాస్య రోజున దర్గాలో కదలికలు వస్తుంటాయని, ఆ రోజు అక్కడ నిద్రిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. గ్రామంలో ఒక్క ముస్లిం కూడా లేకపోయినా హిందువులే నిర్వహణ బాధ్యతను చేపట్టారు. గంధోత్సవం సందర్భంగా కడప నుంచి ముస్లింలు పుష్పాలను తీసుకురావడం ఆనవాయితీ. తెల్లవారు జామున ఉత్సవ కమిటీ పెద్ద ఇంటి నుంచి ప్రత్యేక రథంపై గంధాన్ని ఉంచి దర్గా వరకు ఊరేగింపుగా తీసుకువస్తారు. అనంతరం ముజావర్లు అప్పటికే పాత ఛద్దర్(దర్గాపై ఉండే వస్త్రం) తొలగించి కొత్తదానిని కప్పి ఉంచుతారు. దర్గాకు చేరుకున్న గంధాన్ని 144 అడుగుల దర్గాపై పూసి మరో వస్త్రంతో కప్పడం ద్వారా గంధోత్సవం పూర్తవుతుంది. మిగిలిన గంధాన్ని భక్తులకు పంచుతారు.


144 అడుగుల వేనాడు దర్గా(ఫైల్)

తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఓజిలి: బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ పద్మావతిని శుక్రవారం మానమాలకు చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఉప సర్పంచ్ ఉమ్మారు హరనాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌ను శాలువాతో సత్కరించారు. మండలంలో భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే ఎస్ఐ స్వప్నను కలిసి శాలువాతో సన్మానించారు. నేతలు ఉగ్గుమూడి సంతోష్‌రెడ్డి, కూడివాడ వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ పద్మావతిని సన్మానిస్తున్న హరనాథ్‌రెడ్డి

గోవిందరాజులుకు సన్మానం

వెంకటగిరి రూరల్ : పశ్చమగోదావరి జిల్లా వెంకటరామయ్యగూడెం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్స్‌గా పదోన్నతి పొందిన వెంకటగిరి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులును శుక్రవారం కేవీకే సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన పెట్లూరు నిమ్మకు ప్రత్యేక స్థానం తీసుకువచ్చారు. ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో శిరీష, పెట్లూరు చీనీ, నిమ్మ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మధుమతి, పశుసంవర్ధకశాఖ వైద్యులు స్వామిబాబు, సీడీపీవో శంషాద్‌బేగం, కేవీకే శాస్త్రవేత్తలు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన, డాక్టర్ శేషమనాయుడు, సత్యనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.


గోవిందరాజులును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట మండలం బిరదవాడకు చెందిన పనబాక హర్షవర్ధన్(20) శ్రీసిటీలోని ఒక ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అతను శుక్రవారం అదే గ్రామానికి చెందిన రవివర్మ, ముత్యాలుతో కలిసి బైక్‌లో నాయుడుపేటకు వెళ్లారు. తిరిగి రాత్రి గ్రామానికి బయలుదేరారు. బిరదవాడ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. బైక్ నడుపుతున్న హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. రవివర్మ, ముత్యాలు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ బాబి అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన హర్షవర్ధన్

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

తడ: మండలంలోని కాదలూరు వంతెన వద్ద గురువారం అర్ధరాత్రి ముందు వెళుతున్న లారీని తడ నుంచి హైదరాబాదు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. చెన్నై నుంచి వచ్చే ప్రయాణికులను తడ మండలం కాదలూరు వద్ద బస్సు డ్రైవర్ దినేష్ పికప్ చేసుకుని హైదరాబాదు బయలుదేరాడు. ఈ క్రమంలో వేగంగా వెళుతున్న ముందు వెళుతున్న లారీని ఢీకొన్నాడు. అనంతరం బస్సు కాలువ వంతెన రక్షణ గోడను ఢీకొంది. దీంతో బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. 35 మంది ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. లారీలోని విషనరీ దెబ్బతినింది. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

కండలేరులో 9.185 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 9.185 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 45,700 క్యూసెక్కుల నీరు చేరుతోందని పేర్కొన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 230, పిన్నేరువాగుకు 25, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వినాయక చవితి ఏర్పాట్లలో అలసత్వ వద్దు

తడ: నిబంధనల మేరకు వినాయక చవితి పండుగను జరుపుకోవాలని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం తడ పోలీస్ స్టేషన్‌లో వినాయక మండప నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మండపానికీ పోలీస్, విద్యుత్ శాఖల అనుమతులు పొందాలని సూచించారు. మండపం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని, వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కొండపనాయుడు పాల్గొన్నారు.

వరద బాధితులకు రాజినేని ట్రస్టు చేయూత

చిల్లకూరు : మండలంలోని చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు విజయవాడ వరద బాధితులకు శుక్రవారం పాలు, బిస్కెట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు శిరీష, రామానాయుడు, బాబు మాట్లాడుతూ బాధితులకు సాయం అందించాలన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

గూడూరు రూరల్ : విజయవాడలోని వరద బాధితులకు గూడూరులోని పలు సంస్థల ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. బాలాజీ లెమన్ మార్కెట్ తరపున రూ.2 లక్షలు, చిల్లీస్ మర్చెంట్స్ అసోసియేషన్ రూ.50 వేలు, గూడూరు పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ రూ.లక్ష, చిట్టమూరు నాయకుడు కిషోర్‌నాయుడు రూ.1.50 లక్షలను ఇచ్చారు. ఈ మేరకు చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు అందజేశారు. తలమంచి సిద్దారెడ్డి, పెంచలయ్య, మస్తాన్‌నాయుడు, వెంకటేశ్వరరాజు, బాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

సిలికా లారీ పట్టివేత

చిల్లకూరు : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా సిలికాను తరలిస్తున్న లారీని చిల్లకూరు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు శుక్రవారం వరగలి క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పారిచర్లవారిపాళెం సమీపంలోని వాషింగ్ ప్లాంటు నుంచి సిలికాను చెన్నైకి తరలిస్తున్న లారీని పరిశీలించారు. అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు.

సూళ్లూరుపేట ఎస్ఐ-2గా వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణం రెండో ఎస్ఐగా మలిచి వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఆయన మరో ఐదు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో సొంత ప్రాంతమైన సూళ్లూరుపేటకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన గతంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట మండలాల్లో కానిస్టేబుల్‌గా, హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఎస్ఐగా పదోన్నతి పొంది దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల్లో పనిచేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నాయుడుపేట టౌన్ : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని అరవపెరిమిడి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ మణెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం శ్యామలమ్మ, వరమ్మ, స్వర్ణలత, కామేశ్వరి, రాఘవేంద్రమ్మ పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి బయటపడవచ్చని సీడీపీవో శంషాద్‌బేగం తెలిపారు. వెంకటగిరి మండలం సిద్ధవరం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శంషాద్‌బేగం

తెలుగు రాష్ట్రాలకు రూ.5 వేల కోట్లు కేటాయించాలి

వెంకటగిరి రూరల్/వెంకటగిరి(సైదాపురం) : తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఒక్క పైసా కూడా కేటాయించలేదని, తక్షణమే రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డీఏ, తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు, ట్యాక్స్‌లు విపరీతంగా పెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 ఏళ్ల క్రితం మన్నవరం భెల్ పరిశ్రమ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమ అధ్వానంగా తయారైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి భెల్ పరిశ్రమ పనులు వేగవంతం చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సూచించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు పునఃప్రారంభించి వెనుకబడిన వెంకటగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాల్లో కొందరు భూస్వాములకు పరిమితికి మించి వ్యవసాయ భూములు ఉన్నాయని, రీసర్వే చేసి ప్రభుత్వ నిబంధల మేరకు అధికంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశానానికి దారిచూపాలని మృతదేహంతో నిరసన

గూడూరు రూరల్ : గూడూరు మండలం విందూరులో శ్మశానానికి దారిచూపాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం మహిళ మృతదేహంతో గ్రామ సచివాలయం ఎదుట నిరసనకు దిగారు. విందూ రులో ఆదెమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారి లేదు. దారి కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారు. దీంతో మృతదేహంతో సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ అక్కడికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి నిరసనను విరమింపజేశారు.


ధర్నా చేస్తున్న గ్రామస్తులు